# బళ్ళారి రాఘవ

### 118వ జయంతి, ఆగస్టు 2, 1997

తన వినూత్నమైన, సాత్త్విక ప్రధానమైన నటనా విధానంద్వారా ఆంధ్ర నాటక రంగంలో ఆధునికతను శ్రీకారం చుట్టిన మహానటుడు బళ్లారి రాఘవ. నాటకరంగం అంటే ఆయనకు ఉన్న ప్రగాఢ విశ్వాసం, ప్రేమ తన సమకాలీనర నాటక రంగంమీద ఆయనకు ఉన్న నిర్ద్వంద్వమైన అభిప్రాయాలు నటులందరికీ ఆదర్శప్రాయాలు. సంప్రదాయ నాటకాలలో పాల్గొంటూ నటునిగా ఉన్నత శిఖరాలను అధిరోహించినా, భవితవ్యానికి ఆహ్వానం పలికిన దార్శనికుడు రాఘవ. అందువల్లనే పురాణకథలకన్న సాంఘిక సమస్యలే నాటక ఇతివృత్తాలు కావాలన్నాడాయన. సంగీత నాటకాల కన్న సాంఘిక గద్య నాటకాలే ఈనాటి అవసరం అని భావించాడాయన.

1880 వసం॥లో ఆగస్టు 2 వతేదీన తాడిపత్రిలో జన్మించాడు రాఘవ. అసలు పేరు తాడిపత్రి రాఘవాచార్యులు. బళ్లారి వచ్చిన తరువాత బళ్ళారి రాఘవగా ప్రసిద్ధుడు. ఒక్క నాటక రంగంలోనే కాక అనేక ఇతర కార్యక్రమాలలో తన ప్రతిభను కనబరిచినవాడు ఆయన. లాయరుగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, సంఘ సంస్కర్తగా, మానవతా వాదిగా, ఆధ్యాత్మిక వేత్తగా ఆయన భారతీయుల, విదేశీయుల మన్ననలు అందుకున్నాడు. బెర్నార్డ్‌షా, రవీంద్రనాథఠాగూర్, మహాత్మాగాంధి వంటివారి ప్రశంసలందుకున్నాడు తన నటనా ప్రాభవానికి.

రాఘవని ఈనాడు స్మరించుకోవడం ఆయన మహత్తరమైన నటనా కౌశలాన్ని గుర్తు తెచ్చుకోవడానికే కాదు. నటన అన్నా, నాటకరంగం అన్నా ఆయన కున్న ప్రబలమైన ఆధ్యాత్మిక స్ఫూర్తి బహుశః ఏ తరం నటులలో నయినా బహుకొద్ది మందికే ఉంటుంది. నాటకరంగం ప్రజలకు హితోపదేవ జనకమని భావించాడు. దానిని నటరాజు ఆలయంగా భావించాడు. నాటక ప్రదర్శనా విధానాన్ని నటనకు శిక్షణకు అవసరమని భావించిన ప్రప్రథముడాయన.

నటుడుగా రాఘవ ప్రశస్తికి ముఖ్యమైన కారణం ఆయా పాత్రలను కూలంకషంగా అవగాహన చేసుకుని వాని ఆత్మావిష్కారం చెయ్యడం. ఆయన ప్రయోగం చేసిన 50నాటకాలలో ఎన్నో వైవిధ్యమైన పాత్రల్ని ధరించాడాయన ప్రహ్లాదలో హిరణ్యకసిపుడు, సావిత్రిలో యముడు వంటి పాత్రలలో రాక్షసత్వంలో ఉండే మానవతా స్ఫూర్తిని ఆవిష్కారం చేశాడు. రామదాసు వంటి పాత్రల్లో భక్తికి భాష్యం చెప్పాడు. అర్జునుడు నలుడు వంటి నాయక పాత్రల్లో ధీరోదాత్త నాయకుణ్ణి ప్రేక్షకుల ఎదుట ఆవిష్కరింపచేశాడు. ఆంగిక, వాచిక, సాత్త్వికాలన్నింటిలోను సమానమైన ప్రతిభాసంపత్తి గల మహానటుడు బళ్లారి రాఘవ.

రాఘవను స్మరించుకొనేటప్పుడు ఇద్దరు మహామహులైన రచయితలను కూడా స్మరించుకోవాలి. ఒకరు ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు. ఆంధ్రనాటక పితామహుడు. తెలుగు పద్యనాటకానికి ఆద్యుడు. రాఘవ

ధర్మవరం వారికి స్వయానా మేనల్లుడు. వృత్తిలో ఆయన దగ్గర అప్రెంటిస్. కాని ఆయన స్థాపించిన సరసవినోదిని సభలో కాకుండా ఆంధ్రచారిత్రక నాటక పితామహుడైన కోలాచలం శ్రీనివాసరావుగారు స్థాపించిన సుమనోరమ సభలో ముఖ్యభూమికలు ధరించేవాడు. ఆ తరువాత రామకృష్ణ నాట్యమండలిలో కూడా ముఖ్యమైన ధర్మవరం నాటకాలలో ప్రధాన పాత్రలు ధరించాడు. ఆంధ్రదేశం నలుమూలలా పర్యటించి నాటకాలు వేశాడు. నాటకం ఆయన సర్వస్వం.

రాఘవ నటజీవితంలో ముఖ్యమైన మలుపు ఇబ్సన్ శతజయంతి ఉత్సవాలు. 1928లో మద్రాసులో ఉత్సవాలు జరిగినప్పుడు ఆయన, రాజమన్నారు, రంగారామ్, ఆమంచర్ల ప్రభృతులు ఇబ్సన్ నాటకాల వల్ల ప్రభావితులై సాంఘిక సమస్యానాటకాల ప్రాముఖ్యాన్ని గుర్తించారు. అదే సంవత్సరం 3నెలల పాటు రాఘవ పాశ్చాత్య దేశాలలో పర్యటించి, అనేక నాటకాలు చూసి తనలో ఇది వరకే రూపుదిద్దుకుంటున్న అనేక భావాలకు స్పష్టమైన ఆకృతి కల్పించుకున్నాడు. అప్పటినుంచి సాంఘిక సమస్యా గద్య నాటకాలు అన్ని హంగులతో వృత్తి నాటక పద్ధతిలో వాస్తవిక రూపకల్పన ప్రదర్శింపబడడం తెలుగు నాటకరంగ అభ్యున్నతికి ప్రథమ సోపానం అని భావించాడు. అవే భావాలు 1933లో ఆంధ్రనాటక కళాపరిషత్తు అధ్యక్ష పీఠంనుంచి ఎతుగెత్తి చాటాడు. తాను స్వయంగా ప్రతిపాదించడమే కాక అటువంటి నాటకాలను రాజమన్నారు చేత వ్రాయించి తాను నటించి, దర్శకత్వం వహిచి ప్రదర్శించాడు. దాని పర్యవసానమే తప్పెవరిది, సరిపడని సంగతులు, తెగని సమస్య మొదలైన నాటకాల రచన, ప్రదర్శన.

అలాగే వాస్తవిక రూపకల్పనకు స్త్రీలే స్త్రీ పాత్రలు ధరించాలి – అన్న నమ్మికను అమలు పరిచాడు. మాడపాటి సరోజిని, కొమ్మూరి పద్మావతి, కొప్పరపు సరోజిని వంటి కుటుంబ స్త్రీలను రంగస్థలానికి పరిచయం చేసినవాడు రాఘవే!

ఈ విధంగా పాతకొత్తల మేళవింపులో, భవిష్యత్తుకు బంగారు పునాదులు వేసి ఆంధ్రనట లోకానికి ప్రాతః స్మరణీయుడుగా నిలిచిన వాడు బళ్ళారి రాఘవ. రంగస్థలాన్ని విద్యా వేదికగాను, నటుడి రూపారోపాన్ని ఆధ్యాత్మిక అనుభవ సంపదను సంతరించుకొనే మాధ్యమంగాను భావించి 50 సంవత్సరాలపాటు తెలుగు కన్నడ నాటక రంగాలలో మహానటుడుగా, మేధావిగా, రంగస్థలం మీద కలకాలం గుర్తుపెట్టుకొనే పాత్రలను పునఃసృష్టించిన రసస్రష్టగ బళ్ళారి అజరామరుడు. ఆయన స్మరించుకోవడం అంటే ఆయన ఆశయాలను పునరంకితం కావడమే! ఆయన నాటకరంగాన్ని ఎంత పవిత్రంగా భావించారో, నటశిక్షణ ఆవశ్యకతపై ఎత మక్కువ చూపారో, ఆంధ్రనాటక రంగం పురోగతికి ఎంత శ్రమించారో – మనం అందరం అటువంటి స్ఫూర్తితోనే తెలుగు నాటకరంగ అభ్యున్నతికి పరిశ్రమించడం ఒక్కటే ఆయనకి మనం ఇవ్వగల నివాళి!

రాజమన్నారు రాఘవ ప్రేరణ మీద 1929లో వ్రాసిన నాటకం తప్పెవరిది? – తెలుగు నాటక చరిత్రను ఒక మలుపు తిప్పిన నాటకం. “తప్పెవరిది” నాటకంలో ఆనాడు ప్రబలంగా ఉన్న సాంఘికన సమస్య – వృద్ధ వివాహం – అందువల్ల కలిగే కష్టాలు – వర్ణితాలు. రాఘవ సబ్‌రిజిస్ట్రారుగాను, శ్రీమతి కొమ్మూరి పద్మావతి ఆయన భార్యగానూ నటించిన ఆ నాటకంలో ప్రథమ ఘట్టాన్ని ఇప్పుడు చూద్దాం